క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కంచరపాలెం: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్ వాకర్స్ క్లబ్, శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ద్వారకానాథ్ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జయతి ఉమా మహేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ పర్యవేక్షణలో వాకర్స్ క్లబ్ కుటుంబ సభ్యులు, స్థానికులు నేత్ర శిబిరాన్ని వినియోగించుకున్నట్లు కార్యదర్శి కాళ్ల వెంకట ప్రసాద్ తెలిపారు. సుమారు 232 మందికి ఉచిత సంపూర్ణ నేత్ర పరీక్షలు చేసి మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఉపాధ్యక్షుడు జె.రమేష్ కుమార్, కోశాధికారి సోండి కిషోర్‌కుమార్, సహాయ కార్యదర్శి ఇమ్మానుయేల్, జాలీ వాకర్ ఏఎల్ నరసింహారావు, వైద్య సిబ్బంది, బోర్డు కో–ఆర్డినేషన్ సభ్యులు, క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ దుకాణాలకు వేలం

అల్లిపురం: కేజీహెచ్ డౌన్‌లో ఉన్న రక్షా కాంప్లెక్స్ షాపు నంబరు 13 (గ్రౌండ్ ఫ్లోర్), షాపు నంబర్ 24 (ఫస్ట్‌ఫ్లోర్), షాప్ నంబరు 32 (ఫస్ట్‌ఫ్లోర్) లీజుకి ఇవ్వడం నిమిత్తం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు అడ్వాన్సు చెల్లించాలన్నారు. ప్రతి సంవత్సరం 10 శాతం అద్దె పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు పోలీస్ బ్యారెక్స్ (సిటీ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వు కాంప్లెక్స్)లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనదలచిన వారు అదనపు సహాయ పోలీస్ కమిషనర్, పరిపాలన విభాగం, విశాఖపట్నం సిటీ వారిని 94409 04710, 99488 42851 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పెహల్గాం మృతుల ఆత్మశాంతికి పూజలు



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

మహారాణిపేట: పెహల్గాం దాడిలో చనిపోయిన పర్యాటకులకు, అమరులైన మన వీర జవాన్లకు ఆత్మశాంతి చేకూరాలని జీవీఎంసీ 29, 30 వార్డుల కూటమి వార్డు అధ్యక్షులు ఉరుకూటి గణేష్, అంగటి శ్రావణ్‌కుమార్, 29వ వార్డు బీజేపీ అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయ కనకదుర్గ కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ దక్షిణ నియోజకవర్గం కన్వీనర్ అత్తిలి శంకరరావు, నగర ఉపాధ్యక్షుడు రాంబాబు, మైనార్టీ మోర్చా సీనియర్ నాయకుడు సీహెచ్ రాజబాబు, దళమంతుల శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకుడు పల్ల చలపతి, పల్ల లక్ష్మి, ఎన్వీ నరసింహ, జోజి బాబు, సోమవాదుల వెంకటరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



సర్టిఫికెట్లతో చిన్నారులు

దాబాగార్డెన్స్: వేసవి నృత్య సమ్మేళనం–2025 పేరిట నాట్య దీపిక కూచిపూడి అకాడమీ, వరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సింహపురి కాలనీ సమీపాన వాసుదేవం ఫంక్షన్ ప్లాజాలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ ఎల్. ఇంద్రాణి నరేంద్రరెడ్డి, వరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాల వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ బి. కనకమహాలక్ష్మి నేతృత్వంలో చిన్నారులు కూచిపూడి, భరతనాట్యంతో పలువురి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, మంతా నాగసుధ, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మామిడి పండ్లకు కేరాఫ్.. రామకృష్ణా జంక్షన్

- విజయనగరం, తుని రైతుల విక్రయాలు
- తెల్లవారు జాము నుంచి అమ్మకాల సందడి
- హోల్‌సేల్ ధరల్లో లభ్యం



అల్లిపురం: వేసవి వచ్చిందంటే పండ్లలో రారాజుగా పిలిచే మామిడి పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. మామిడి పండ్లలో వందలాది రకాలు ఉన్నా అందరూ ఇష్టపడేది బంగినపల్లి మామిడి పండే అంటే అతిశయోక్తికాదు. ఈ సీజన్‌లో బంగినపల్లి మామిడి పండు తినని వారుండరు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లేటప్పుడు వెంట బంగినపల్లి మామిడి పండ్లు తీసుకెళ్లడం పరిపాటి. ఈ ఏడాది మామిడి పంట దిగుబడి తక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ నగరానికి కొత్తవలస, సబ్బవరం, విజయనగరం, తగరపువలస ప్రాంతాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా తుని, విజయనగరం జిల్లా రామచంద్రపురం నుంచి మామిడి పండ్లు నగరానికి వస్తున్నాయి. దీంతో నగరంలో ముఖ్యంగా అల్లిపురం రామకృష్ణా జంక్షన్‌లో రైతులు విక్రయాలు చేపడుతున్నారు.

ఉదయం 3 నుంచే విక్రయాలు..

నగరం అంతా నిద్రావస్థలో ఉంటే రామకృష్ణా జంక్షన్‌లో మాత్రం తెల్లవారు జాము 3 గంటల నుంచి సందడి మొదలవుతుంది. రైతులు వ్యాన్లు, ఆటోల్లో పండిన మామిడి పండ్లు తీసుకొచ్చి సర్దుకుంటారు. వ్యాపారులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతుంటారు. పచ్చళ్లు పెట్టుకునే వారు మామిడి కాయలు కొనుక్కోవడానికి ఇక్కడికే వస్తుంటారు. బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు, కలెక్టర్, పనుకులు, కోలంగోవ, కొబ్బరి మామిడి వంటి రకాలు క్రేట్ల లెక్కన అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో వీధి వ్యాపారులు, ఆటో వ్యాపారులు ఇక్కడి నుంచే కొనుగోలు చేస్తుంటారు.

అందుబాటు ధరల్లోనే..

ఇక్కడ మామిడి పండ్లు అందుబాటు ధరల్లోనే లభిస్తున్నాయి. రకాలను బట్టి బంగినపల్లి, సువర్ణరేఖ కేజీ రూ.75 నుంచి రూ.80, ఓపెన్ మార్కెట్‌లో కేజీ రూ.100 నుంచి రూ.150కి లభిస్తున్నాయి. రసాలు రైతు బజారులో కేజీ రూ.100కి లభ్యమవుతున్నాయి.

కార్బైడ్‌తో ప్రమాదం..

మామిడి పండ్లను కొందరు వ్యాపారులు అత్యాశ కారణంగా విషతుల్యంగా మారుస్తున్నారు. ప్రస్తుతం మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను వ్యాపారులు వినియోగిస్తున్నారు. వీటి వినియోగం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రంగును చూసి గుర్తించొద్దు..

రంగును చూసి మామిడి పండ్లను చాలా వరకు గుర్తించే అవకాశముంది. కార్బైడ్, ఇతర రసాయనాలు ఉపయోగించిన మామిడి పండ్లు బయటికి లేత పసుపు, లోపల లేత తెలుపు రంగులో ఉంటాయి. సహజంగా పండిన పండు బయట, లోపల ఒకే వర్ణంలో ఉంటాయి. రసాయనాలు విడుదల చేసే ఎసిటిలిన వాయువుతో పండ్లు బయట వైపు రంగు మారుతుందే తప్ప అంత రుచిగా ఉండవు.



రామకృష్ణా జంక్షన్‌లో మామిడి పండ్లు విక్రయిస్తున్న రైతులు

ధర గిట్టుబాటు కావడం లేదు..



తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి మామిడి పండ్లు నగరానికి తీసుకు వస్తున్నాం. కానీ ధర గిట్టుబాటు కావటం లేదు. కొనే వారు ఎంత తక్కువ చెప్పినా బేరాలు ఆడుతున్నారు. పచ్చి వ్యాపారం ఏ రోజు కారోజు అమ్ముకోకపోతే పాడవుతాయి. మా కూలీ గిట్టుబాటు చూసుకుని అమ్ముకుంటున్నాం.

– వినోద్, మామిడి పండ్ల వ్యాపారి

ఏడాదికి ఒకసారి..



ఏడాదిలో రెండు నెలలు మాత్రమే మామిడి పండ్లు దొరుకుతాయి. ఎంత ధరైనా కొని తినాల్సిందే. బంగినపల్లి మామిడి పండ్లు ఈ ఏడాది రుచిగా, తియ్యగా ఉన్నాయి. కాయ ముదరటంతో మంచి రుచి వచ్చింది. మే మధ్యలో పండ్లకి మంచి రుచి వస్తుంది. ఇదే కరెక్ట్ సమయం మామిడి పండు తినడానికి.

– ఎం.సుబ్బులక్ష్మి, వినియోగదారు

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని వంటా వార్పు చేసుకున్నారు. ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎర్నిమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఈవో డీవీఎస్ సురేష్‌బాబా చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ఎద్దడికి భక్తులు, పాదచారులు, వాహన చోదకులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం భక్తులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండా రమణ, నమ్మి రాజు గోపాల్, చంద్రమౌళి, పులఖండం శ్రీకాంత్ శర్మ, వాసుపల్లి విజయమ్మ, ప్రసాద్, రామకృష్ణ, అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం గ్రామాల సేవకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ జీడీ బాబు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు



నాకాబందీ నిర్వహిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

అల్లిపురం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు రౌడీషీటర్లను హెచ్చరించారు. జోన్–1 డీసీపీ ఎ.వేజెండ్ల పర్యవేక్షణలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రౌడీ షీట్ నమోదైన ప్రతి ఒక్కరూ సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ ఎర్రం నాయుడు హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాత్రిపూట పెట్రో, బ్లూకోట్స్ పోలీసుల నేతృత్వంలో రౌడీషీటర్లు నివసించే ప్రాంతాల్లో నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లు సతీష్, శంకర్, సింహాచలం, పీసీలు ప్రేమానంద్, వినోద్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీ షీటర్లకు ఆదివారం సీఐ జీడీ బాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ లేదా నగర బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంచి ప్రవర్తన కలిగి చట్టాన్ని గౌరవించే రౌడీషీటర్లకు ప్రోత్సాహం అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అవసరమైతే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, అలాగే వారి రౌడీ షీట్లు క్లోజ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు రౌడీ షీటర్లు పాల్గొన్నారు.

వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో నాకాబంది..

ఆదివారం పాత నగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది (వాహన తనిఖీ)ని సీఐ జీడీ బాబు స్టేషన్ అధికారులతో కలిసి చేపట్టారు. అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వాహనాలు నిలిపి వాటి సంబంధిత పత్రాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు తదితర డాక్యుమెంట్లు పరిశీలించారు. ఇప్పటి నుంచి ప్రతిరోజూ నాకాబంది కార్యక్రమాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనాగుతాయని ఆయన తెలిపారు. రికార్డులు లేని ఒక ఆటో, 6 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మాతృమూర్తులే సమాజానికి దిక్సూచి

మాతృదినోత్సవంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డా.సంధ్యాదేవి



ఆచార్య శాంతమ్మ, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవిని సన్మానిస్తున్న శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చర్ యూత్ అకాడమీ

మహారాణిపేట: స్థానిక ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సాలయం సంయుక్త నిర్వహణలో మాతృదినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ మాతృమూర్తులు సమాజానికి దిక్సూచిలాంటివారని, పిల్లల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది వారేనన్నారు. ఈ సందర్భంగా దేశంలో భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందిన మొదటి వనిత ఆచార్య చిలుకూరి శాంతమ్మను ఘనంగా సత్కరించారు. ఈ వయసులో కూడా విద్యార్థులను తీర్చిదిద్దుతూ, 20 మంది విద్యార్థులు డాక్టరేట్ పట్టాలు పొందడం శాంతమ్మ ఘనతకు నిదర్శనాలని కొనియాడారు. సన్మాన గ్రహీత శాంతమ్మ మాట్లాడుతూ యువత విద్యలో, క్రీడల్లో కృషిచేసి దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఏవీఎస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సింగరాజు కృష్ణకుమారి, సింగరాజు సతీష్ కుమార్, ఏయూ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పుల్లారావు, తలాడ గిరిజ మాతృమూర్తుల త్యాగాలను, వారి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రూపాకుల రవికుమార్, చొక్కాకుల రాంబాబు, పల్లా చలపతిరావు, దేవర చంద్రశేఖర్, సీహెచ్ రాజబాబు, ఎరిన్గంటి లక్ష్మి, ఎర్నింటి వెంకటలక్ష్మి, బొట్ట రమణమ్మ , గేదెల శ్రీహరి , రాహుల్, ఎ.రాధ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన ఉష్ణతాపం



ఖాళీగా కనిపించిన రామకృష్ణ రైతుమార్కెట్



నిర్మానుష్యంగా పూర్ణామార్కెట్ రోడ్డు



జనసంచారం కానరాని డాల్ఫిన్ హోటల్ జంక్షన్

జగదాంబ: ఆదివారం ఎండ ఠారెత్తించింది. రోజు కాసే ఎండ కంటే రెండు డిగ్రీలు ఎక్కువే ఎండ కాయడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఎండకు ఉదయం నుంచే జనాలు రోడ్ల పైకి రాలేదు. మార్కెట్లు ఖాళీగా దర్శినమిచ్చాయి. ఇళ్లలోని ఫ్యాన్లు సైతం వేడి గాలులు వీయడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. చిరు వ్యాపారులు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రానికి కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడంతో ప్రజలందరూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న లేబర్ కోడ్‌లు

దాబాగార్డెన్స్: లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాళ్‌లో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించి, ప్రచార పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాళ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చాయని తెలిపారు. అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి ద్రోహం చేసిందన్నారు. అవి పూర్తిగా కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తిరుపతిరావు, వై. కొండయ్య, బి. గీత, కనకరెడ్డి, పీవోడబ్ల్యు జిల్లా నాయకురాలు బాల నాగమ్మ, అరుణోదయ సంఘం నాయకులు ఏడుకొండలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నృసింహావతారంలో బల్లిగిరి వెంకన్న



నృసింహావతారంలో వేంకటేశ్వరస్వామి



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆదివారం భక్తులకు నృసింహావతారంలో దర్శనమిచ్చారు. నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథాచార్యులు, గొడవర్తి రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, సహస్ర నామాభిషేకాలు, వైష్ణవ సాంప్రదాయంలో ఆగమ శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామి వారికి భక్తులు మామిడి పండ్లు నివేదించారు.

నేడు చక్రస్నానం..

కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం బల్లిగిరి దేవాలయం ఆవరణలో చక్రతీర్థం, వసంతోత్సవం, పూర్ణాహుతి, తిరుమంజన సేవ, అష్టోత్తర శత కలశస్నపనం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రఘునాథాచార్యులు తెలిపారు.

దుర్గాలమ్మ పండగ ప్రారంభం



దుర్గాలమ్మ

దాబాగార్డెన్స్: కృష్ణాగార్డెన్స్ గ్రామదేవత దుర్గాలమ్మ పండగ ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయింది. ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం రాట కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పలువురు ముత్తయిదువులు పసుపు, కుంకుమ నీళ్లతో అభిషేకించారు. రాత్రి 7 గంటల నుంచి కృష్ణాగార్డెన్స్ రామాలయం వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం తొలేళ్ల మహోత్సవం జరపనున్నారు. 13న ప్రధాన పండగను పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పరస మహోత్సవం, అనుపు కార్యక్రమం పెద్ద ఎత్తున జరపనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి తిరువీధి నిర్వహించారు. గరిడి, పులి వేషాలు, కాళికాదేవి వేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం, కాంగో డప్పులు, అమ్మవారి మాదిగ డప్పులతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బొట్ట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దుక్క ఆనంద్, కార్యదర్శి కర్రి గణేష్, సహాయ కార్యదర్శి ఒమ్మి శేఖర్, కోశాధికారి ముగడ శ్రీనివాసరావు, సహాయ కోశాధికారి బరణికాన వర్మ, కమిటీ సభ్యులు కోవెల విశాల్, నౌడగల చరణ్ కిషోర్, ఒమ్మి అజయ్, పీతల సాయి కిరణ్, ఒమ్మి అచ్చిబాబుతో పాటు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు పసుపు, కుంకుమ నీళ్లు తీసుకెళ్తున్న భక్తులు

రేపటి నుంచి కొత్తమ్మవారి పండగ



అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారు

అల్లిపురం: అమ్మవారి వీధి ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మ వారి జాతర మంగళవారం నుంచి నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీంట్లో భాగంగా మంగళవారం భూలోకమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రెండేళ్లకోసారి అమ్మవారి పండగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురక సమస్య నివారణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

మహారాణిపేట: వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే గురక వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు, అంకోశా అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ఈ అప్పారావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసా హాల్లో శృతిత ఈఎన్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన నిరంతర వైద్య విద్యా (సీఎంఈ) కార్యక్రమంలో పలువురు నిష్ణాతులైన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు నూతన వైద్య విధానాలకు సంబంధించి వైద్యులు, వైద్య విద్యార్థులకు ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ కిషోర్, నంద్యాలకు చెందిన డాక్టర్ మధుసూదనరావు గురక నివారణ, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీపై మాట్లాడారు. అధిక బరువు, ఊబకాయం, సైనసైటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిలో గురక అధికంగా ఉంటుందన్నారు. ఆక్సిజన్ లెవల్ తగ్గడంతో మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. షుగర్, బీపీ, గుండెపోటు వంటి జబ్బులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. సకాలంలో వైద్య సలహాలు తీసుకోకపోతే ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 400 మంది వరకూ వైద్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ పూర్వ కమిషనర్ వై.వి. అనురాధ, డాక్టర్ చిట్టి పంతులు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సరోజిని, అంకోశా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ వెలంగిణిరావు, డాక్టర్ కావ్య, రాఘవేంద్రరావు, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ సుశ్రిత తదితరులు పాల్గొన్నారు.